# హత్య

రెడ్డప్పకు తన చదువుకు వుండవలసిన వయస్సుకంటె ఎక్కువే వుంది. వయస్సుకంటే తను ఇంకా ముదురుగా కనిపిస్తాడు. అందుకే ఆమధ్య రాయచోటికి దగ్గరగా వున్న సంగటిపల్లె నుంచీ సంబంధం వచ్చింది. ఇరవైవేలలెక్కా, పదితులాల బంగారం పెడతామన్నారు. "మావానికప్పుడే పెండ్లేంది? వాడు పైసదువులుకు పోవాల" అన్నారు రెడ్డప్ప అమ్మా, నాయినా.

"సదవనీ, మేం వద్దన్నామా! మా పిల్లగూడా ఇంగా ఏడాదిగ్గానీ ఎదగదు. పాతసుట్టరికం, కల్పుకుంటే బావుంటాదని వొచ్చినాం" రెడ్డప్ప పై సదువులకు ఏడాది టైమిస్తున్నట్టు అన్నారు వాళ్ళు.

"ఈ ఏడు పది పాసైతేకాలోజిలో సదివిచ్చుకోవాల. అప్పుడే మావానికి పెండ్లిసెయ్యాం" అని తేల్చిచెప్పినారు రెడ్డప్ప అమ్మానాయినా. వాళ్ళవానికి పెండ్లి సెయ్యమని చెప్పినారుగానీ, సంబంధం వచ్చిన సంగతీ, ఇంతలెక్కా బంగారం ఇస్తామన్న సంగతీ (ఆ లెక్క బంగారానికి వాళ్ళింకొంచెం కలుపుకుని) వీలైనంత ప్రచారం చేసుకుని, సాధ్యమైనంత సంతోషం అనుభవించినారు. రెడ్డప్ప చదువుమీద వాళ్లుంచుకున్న నమ్మకానికి ఫలితం అప్పుడే కనిపించింది వాళ్ళకు. "ఇప్పుడే ఇంతిస్తా మనొచ్చినారే మనోడు చదువుకొని ఏదైనా ఉద్యోగం చేసేటప్పుడు ఇంకెంత రావచ్చా!" అని లోలోపల లెక్కలువేసుకున్నారు. ఆ రకంగా ఆ రాబోయే ఆనందం రుచికూడా కొంచెం చూసినారు. దీనికంతా కారణం రెడ్డప్ప సదువుకోవడమేగదా! అప్పట్నించీ "బాగసదువుకోవాల" "బాగసదువుకోవాల" అని రెడ్డప్పకు చేసే హెచ్చరికలు బాగా ఎక్కువయ్యాయి.

నిజానికి అంతకు ముందునుంచే వాళ్ళు రెడ్డప్ప చదువును గురించి భయపడుతూ, రెడ్డప్పను భయపెడుతున్నారు. అతని చదువుపెరిగే కొద్దీ వాళ్ళ హెచ్చరికలు పెరుగుతూవస్తున్నాయి. రెడ్డప్ప 'బాగ సదువు' కోడానికి తాము ఏంజెయ్యాల్నో వాళ్ళకు

తెలీదు. తెలిసినా ఇద్దరూచదువుకోనివాళ్ళే గనుక హెచ్చరించడం తప్ప ఇంకేం చెయ్యలేరు. కొడుకు చదువు విషయంలో తామేం చెయ్యలేమన్న సంగతి గుర్తించడానికి ఇష్టం లేక, తాము అట్లా హెచ్చరిస్తూ వుండబట్టే రెడ్డప్పబాగా చదువుకుంటూ వస్తున్నాడని అనుకుంటున్నారు. ఇది తమ బాధ్యతను నెరవేరుస్తున్న తృప్తినిస్తోంది. రెడ్డప్ప ఏక్లాసులోవున్నా, ఆ క్లాసు పిల్లల్తో స్నేహముండదు. అందుకు వాళ్లమ్మా నాయినా చేసే హెచ్చరికలే కారణం. "ఇదో! నువ్వెవర్తోనూ సావాసాలు సెయ్యొద్దు. వాళ్ళంతా సిన్మాలకూ, వోటల్లకూ అలవాటైనోళ్లు. వాళ్ళతో తిరిగితే పాడయిపోతావ్. సెర్దగా సదువుకుని మన వొంశానికంతా పేరు తేవాల" తనక్లాసులో తనకంటే చిన్నవాళ్ళను చూసినా తనను చెడగొట్టగలిగిన సమర్థులుగానే కనిపిస్తారు రెడ్డప్పకు. వాళ్ళను చూసి లోలోపల భయపడుతుంటాడు. ఆ భయమూ, వొంశానికంతా పేరు తేవలసిన బరువూ మీదపడడంతో, దీనంగా దిగులుగా కనిపిస్తాడు రెడ్డప్ప. రెడ్డప్ప కట్టుకునే బట్టలుకూడా తమాషాగా వుంటాయి. వాటిల్లో గుడ్డమంచిదైనవీ, ఖరీదైనవీ వుంటాయి. అవి కూడా రెడ్డప్ప మీద వున్నప్పుడు వికారంగానే వుంటాయి. వాటిని మంచి టైలర్ చేత కుట్టించడు వాళ్ళనాయిన. ఎవడు కూలితక్కువక్కుడితే వాని చేత కుట్టిస్తాడు. తోటిపిల్లలు అతని బట్టల్నుచూసి, ఎగతాళి చేసినప్పుడు, రెడ్డప్ప ఇంటిదగ్గర గొణుగుతాడు. "సోకులుమరిగితే ఇంగ సదువుసున్నా........" అని తేల్చేస్తాడు వాళ్ళనాయిన.

వాళ్ళ వూరు కడపకు పదిమైళ్ళదూరంలో వున్న గంగనపల్లె. కొద్దిగా పొలముంది, రెడ్డప్ప ఒక్కడే కొడుకు. కొడుకును ఏ హోటళ్ళలోనో, హాస్టళ్ళలోనో విడిచిపెడ్తే, చెడ్డపిల్లల్తో చేరి చెడిపోతాడు. గంగనపల్లె పిల్లల్లో ఇద్దరు ముగ్గురు అట్లా సెడిపోయి తిరిగి వూరు చేరుకున్నారు. "వున్నవొక్కడూ అక్కడా ఇక్కడా వుండడమెందుకు? ఈ రెండు బరెగొడ్లనూ అక్కన్నే పెట్టుకుంటే సంసారం గడుస్తుంది, ఈ కోడెగిత్తల్ను ఆడికితోలకపోతే బాడిగలొస్తాయి. అదునుకొచ్చి, ఆనాలుగెకరాలూ సేసుకుని పోవచ్చు" ఈ ఆలోచనతో కడపల్లో కాపురం బెట్టినారు. కష్టపడి చదువుకుని పైకొచ్చిన వాళ్ళ కథలు విన్నారు. కొడుకువినాలని ఆకథలు చాలాసార్లు చెప్పుకున్నారు. రిక్షాలు తొక్కి చదువుకుని కలెక్టర్లూ, జడ్జీలూ అయినట్టు, అప్పుడప్పుడూ సినిమాలు జూసినారు. వాటన్నింటివల్లా శ్రద్ధగా చదవడమొక్కటే పైకిరావడానికి మార్గమని వాళ్ళకునమ్మకం ఏర్పడింది. అందువల్ల వున్న ఆ వొక్కమార్గాన్నీ రెడ్డప్ప తప్పిపోకుండా చూడాలన్నది వాళ్ల తాపత్రయం. రెడ్డప్పను ఏపనీ చెయ్యనివ్వరు. "మేం చేసుకుంటాంగా నువ్వు సదువుకో పో." అంటారు. రాత్రి పదిపదకొండుదాకా చదువుకుని పడుకుంటే, తెల్లవారు జామున మళ్ళా లేపి కూర్చో బెడతాడు వాళ్ళనాయిన. ఇట్లా చదవడం రెడ్డప్పకు కష్టంగా వుందిగానీ, ఆవీధిలో పెద్దలు "రెడ్డప్పను సూడండి" అని వాళ్ల పిల్లలకు చెప్పడం ఇష్టంగానూ వుంది. అస్థానం పోగొట్టుకోకుండా వుండడానికి తెల్లవారు

జామున బిగ్గరగా చదివేవాడు. మొత్తం మీద, రెడ్డప్పకు కాళ్ళూచేతులూ అన్ని అవయవాలూవున్నా, వాటితో చేసేపని చాలా తక్కువైపోయి, నోటితో చేసే పని చాలా ఎక్కువై పోయింది.

తీరా పదవతరగతి పరీక్షలు దగ్గర పడేసరికి రెడ్డప్ప ఆరోగ్యం బాగాలేదు. అయినా, రాత్రింబవళ్ళు చదువుతూనే వున్నాడు. ఇంగ్లీషు పరీక్షరాసే రోజు జ్వరం కూడా వచ్చింది. పరీక్షలో ప్రశ్నలన్నీ తనకు తెలిసినవీ, అంతకుముందు చాలాసార్లు బట్టీ పట్టినవే అయినా రాసేటప్పుడు జ్ఞాపకం రాకుండాపోయినాయి. ఆప్రశ్నలకు జవాబులు తనురాయలేకుండా వున్నట్టు తెలిసేకొద్దీ గాభరా, భయమూ ఎక్కువయ్యాయి. తన ప్రక్కనున్న పిల్లలు ఎక్కడెక్కడదాచుకున్నవో చీటీలు తీసి కాపీలు కొడుతున్నారు. బయటినుంచీ కిటికీల గుండా ఎగిరి వచ్చిపడుతున్నాయి. ఇన్‌విజిలేటర్ వార్నింగులిస్తూనే వున్నాడు. క్లాస్‌రూం మధ్యలో తిరుగుతూనేవున్నాడు. వాళ్ళు కాపీలు చేస్తూనేవున్నారు. ఒక చీటీ ముక్క రెడ్డప్పకాళ్ళముందు పడింది. అప్పటికే అతనికి సరిగా పరీక్ష రాయలేకపోతున్నందుకు కళ్ళల్లో నీళ్ళూరుతున్నాయి. తన కాళ్ళ ముందుపడిన చీటీ ముక్క నందుకున్నాడు. వణికే చేతుల్తో, కనపడనీకుండా ఇబ్బంది పెడుతున్న కన్నీళ్ళతో చూస్తూ రాస్తున్నాడు.

తనెంతకష్టపడి చదివినాడు! ఈ ప్రశ్నలన్నిటికీ జవాబులు తనకొచ్చుకూడా. ఇప్పుడెందుకో జ్ఞాపకం రావడం లేదు. అయితే, ఇప్పుడు జ్ఞాపకం రావడం మీదనేతన భవిష్యత్తు ఆధారపడివుంది. ఎన్నడూ కష్టపడి చదవని వాళ్ళు, ఈ ప్రశ్నలకు జవాబులే తెలియని వాళ్ళు కాపీలు కొట్టిపాసైతే, కష్టపడిచదివి, జవాబులు తెలిసిన తను ఫెయిల్ అవడమా? వీల్లేదు. ఎట్లానైనాసరే రాయాల. ఇదంతా ఇంత స్పష్టంగా రెడ్డప్ప అనుకోలేదేమో గానీ, వుండడమైతేవున్నట్టే. లేకపోతే, రెడ్డప్ప ఆపని చెయ్యలేడు. చీటీ మీద ఇంకొక చెయ్యి పడే సరికి, బిత్తరపోయిచూసినాడు రెడ్డప్ప. రెడ్డప్ప రాస్తున్న చీటీ అందుకుని, రాసిన కాగితాలతో పోల్చిచూసి.......... రెండు మూడు జవాబుల్ని కాపీ అని కొట్టేసి, చీటీ చించేసి, వెళ్ళికుర్చీలో కూర్చున్నాడు ఇన్‌విజిలేటర్, అంతకుముందు వదిలేసిన కూనిరాగాన్ని మళ్ళీ అందుకున్నాడు కాళ్ళూపుకుంటూ.

ఆ దెబ్బతో ఇకరాసే ప్రయత్నమే చెయ్యలేకపోయినాడు రెడ్డప్ప. ఇంటికి పోయిన తర్వాత, వాళ్ళనాయిన "ఎట్లారాసినావ్వు?" అనడిగితే ఏడ్చేసినాడు. గట్టిగా అడిగితే, జరిగిన సంగతి చెప్పకుండా జరమొచ్చిందని మాత్రం చెప్పినాడు. డాక్టర్ దగ్గరికి తీసుకుపోయి మందులూ, మాత్రలూ తెచ్చిఇచ్చినాడు వాళ్ళనాయిన.

"ఎట్లానన్నా పరీక్షలురాయాల" అన్నాడు. ఎట్లానన్నా సరే, పరీక్షరాసినాడు రెడ్డప్ప. రెడ్డప్ప పరీక్ష తప్పడం, రెడ్డప్పఅమ్మానాయినకేగాదు, ఆ వీధిలో వాళ్ళందరికీ ఆశ్చర్యంగానూ, అన్యాయంగానూ కనిపించింది. "రెడ్డప్ప తప్పినాడా?" అనడిగే వాళ్ళకు జవాబు చెప్పలేక పోయినారు రెడ్డప్ప అమ్మా నాయినా. "మా వాడు అయినాడు" "మాపిల్ల సెకండ్‌క్లాసులో పాసయింది" అని చెప్పుకునే వాళ్ళతోపాటు తామూ చెప్పుకో లేక పోయినందుకు బాధపడినారు. తమ కొడుకు తమకేదో అవమానం తెచ్చి పెట్టినట్టు దిగులుపడినారు. కొందరు ఫెయిలైన వాళ్ళు అంతగా పట్టించుకోలేదు. "ప్చ్! పోతే పోయింది" అన్నారు. రెడ్డప్ప అట్లా అను కోలేకపోయినాడు.

వాళ్ళనాయిన పైరుకు తెచ్చిన 'ఎండ్రిన్' తాగినాడు ఒక సాయంత్రం. వెంటనే కనుక్కున్నారు. లబోదిబోమని ఏడుస్తూ, డాక్టర్ దగ్గరికి తీసుకపోయినారు. ఆఖరికి......... రెడ్డప్ప బతికి బయటపడినాడు. రెడ్డప్ప పరీక్షతప్పిన తప్పును అప్పటికి క్షమించినట్టు సమాధానపడినారు అమ్మా నాయినా. రెడ్డప్ప ఇంగ్లీషులో తప్పినట్టుమార్కులొచ్చిన తర్వాత తెలిసింది. ఆ ఒక్క సబ్జెక్టునూ సెప్టెంబర్‌కు కట్టుకున్నాడు. ప్రయివేటుకూడా పెట్టించుకున్నాడు. ఈసారి మంచి మార్కుల్తో పాసైనాడు. అయితే, జూలై దాకా ఇంటర్‌మీడియెట్లో చేరడానికి వీల్లేకపోయింది. ఆమధ్య కాలమంతా రెడ్డప్ప అటు విద్యార్థీ కాకుండా, ఇటు తండ్రికి పనిలో సాయపడుతున్న కొడుకూ కాకుండా వుండిపోయినాడు. రెడ్డప్ప అమ్మానాయినక్కూడా ఇది కొంచెం చిరాగ్గానే వుండేది. ఏమైనా అంటే, పరీక్ష తప్పినందుకు 'ఎండ్రిన్' తాగినాడు, మళ్ళీ ఏదైనా అఘాయిత్యం చేసుకుంటే! ఇంతవరకూ రెడ్డప్పకూ ఏ పనీ చెప్పకుండా ఉంచింది తామే. ఇప్పుడంటే ఏం లాభం? ఇట్లా అనుకున్నా, ఎప్పుడో ఒకప్పుడు మాత్రం......... కాళ్ళూ చేతులూ లేనట్టున్నకొడుకును చూసి "చెప్పకపోతే మాత్రం వాడు తెలుసుకోవద్దూ" అనుకోకుండా వుండలేకపోయేవాళ్ళు. మళ్ళా....... "ఈ రోన్నాళ్ళే గదా, కాలేజిలో సేర్నానే సదువులో బడిపోతాడు, ఈ మద్దెకాలంలో వాడు మాత్తరం ఏం జేస్తాడు?" అనుకున్నారు.

అడ్మిషన్స్ టైమొచ్చింది. ఆవూళ్ళో ఒక ప్రభుత్వ కాలేజివుంది. ఇంకో ప్రయివేట్ మానేజ్‌మెంట్ జూనియర్‌కాలేజివుంది. ప్రభుత్వ డిగ్రీకాలేజిలో ఇంటర్ సీట్లు చాలా కొద్దిగా వున్నాయి. అసలా 'ఇంటర్'ను ఏ హైస్కూల్ కోతరిమెయ్యాలని ఆకాలేజి చాలా కాలంగా ఆలోచిస్తోంది. ఆవూళ్ళో, కొన్నిఏళ్ళుగా ఇంకో జూనియర్ కాలేజి వుండవలసిన అవసరం క్రమేణా పెరుగుతోంది. ఉన్న కాలేజీల్ని పోషించలేక పోతున్న ప్రభుత్వం.... కొత్తగా జూనియర్ కాలేజీల్ని పెట్ట లేనంది. ఫలితంగా ...... ఆవూరి ప్రయివేట్ జూనియర్ కాలేజిలో సీట్లకు పెద్దపోటీ ఏర్పడింది. కరెస్పాండెంటుకు తెలిసిన వాళ్ళకూ, మేనేజ్‌మెంటులో ముఖ్యులకు

తెలిసిన వాళ్ళకూ, ప్రిన్సిపాల్‌కూ, ఇంకాబలమూ బలగమూవున్న లెక్చరర్స్‌కు తెలిసిన వాళ్ళకూ సీట్లుపోగా, రెడ్డప్ప సీటు కనిపించలేదు."కంపార్ట్‌మెంటలా? ప్చ్! రెగ్యులర్ స్టూడెంట్లకే లేవు" అని పెదవి విరిచినారు.

ఆ వూరికీ ఈ వూరికీ వెళ్ళినాడు రెడ్డప్ప నాయిన. పిల్లకాయను చదివించుకోడానికి వుండూరొదిలి టౌన్లో కాపురం పెట్టినాడు. టౌన్లో సేర్తే, కాలేజివరకూ వుంది కనుక, సదివించు కోవచ్చుననుకున్నాడు. ఇప్పుడు కొడుకును వేరే వూర్లో సేరిస్తే, తను ఆవూరికి మళ్ళా కాపురం మారుస్తాడా? "ఆయన్నీ సూసుకోడానికి ఇప్పుడు కుదుర్దు. ముందువానికి సీటు స్తూసుక్కోవాల" అనుకున్నాడు కానీ ఎక్కడ సూసుకుంటాడు? కొడుకు సీటుకోసం వెతుక్కోవడంలో కొన్ని సంగతులు తెలిసినాయి రెడ్డప్పనాయినకు. రెడ్డప్ప సెర్దగా సదివితేనో; తను సదివిస్తేనో సరిపోదు. అందరూ చదువుకోవాలని చెప్పే ప్రభుత్వం, చాలినన్ని కాలేజీలనే పెట్టిలేక పోయింది. పైగా, డొనేషన్లు తీసుకోకూడదని చట్టం! డొనేషన్లు తీసుకుని సీట్లు ఇవ్వడానికూడా రికమెండేషన్లు అవసరమైనంతగా, యీ సదువులవ్యాపారం అభివృద్ధి చెందిందని ....... చట్టం చేసిన ప్రభుత్వానికి తెలీదా?

ఇంతకుముందు తెలియనివి ఇప్పుడు తెలిసినా రెడ్డప్ప నాయిన చేయగలిగిందేమీ లేదు. రెడ్డప్ప ఇప్పుడు ఇంటికాడనేవున్నాడు. రెడ్డప్పతో పాటు మొదటి దఫా పరీక్షలు రాసి (కాపీకొట్టి) పాసైన వాళ్ళు ఇప్పుడు. ఇంటర్ రెండోసంవత్సరం లో వున్నారు. ఈ సంవత్సరం పదిపాసైనవాళ్ళు (కాపీకొట్టి) మొదటి సంవత్సరంలో వున్నారు. కష్టపడి చదివినరెడ్డప్ప మాత్రం ఇప్పుడు ఇంటికాడనే వుంటున్నాడు.

పదవతరగతి ఫెయిలైనప్పుడు, రెడ్డప్ప ఆత్మహత్యకు ప్రయత్నించినాడు. నిజానికి, మరుసటి సంవత్సరం పాసై, చదువుకోగలిగిన అవకాశం మిగిలే వుందప్పుడు. ఇప్పుడు తను పాసైనా ఇంటర్‌లో సీటు దొరకలేదు. వచ్చేఏడాదైనా దొరుకుతుందో, లేదో తెలీదు. వాళ్ళ నాయిన చదివిస్తానంటాడో, లేదో తెలీదు. తనతోటి వాళ్ళందరూ పై చదువులకు వెళ్ళి పోతున్నారు. వీటన్నింటిరీత్యా చూస్తే, అప్పటికన్నా రెడ్డప్పకు ఇప్పడే ఆత్మహత్య చేసుకోవలసిన కారణాలు బలంగా వున్నాయి. అయితే, రెడ్డప్పకు అటువంటి ఆలోచనేరా లేదిప్పుడు. అమ్మా నాయిన తిట్లను గూడా అరిగించుకుంటున్నాడు. దొంగతనంగా సినిమాలు చూడడం ఎక్కువయింది. పదవతరగతి తప్పినప్పుడు పడిన బాధలో పదోవంతుకూడా లేనట్టు ఇప్పుడు మొద్దుబారిపోయి కనిపిస్తున్నాడు.

అంటే, రెడ్డప్ప పదవతరగతి తప్పినప్పటికి, బ్రతికే వుండినాడు కనుక, ప్రాణం

తీసుకునేందుకు ప్రయత్నించినాడు. అంటే ....... అంటే .......... రెడ్డప్ప అప్పుడు ఆత్మహత్యప్రయత్నంనుంచీ బైటపడి. ఆ తర్వాత హత్యకాబడినాడా? 'హత్య' చేయబడినాడు కనుకనే, ఆత్మహత్యకు యత్నించడం లేదా? అయితే, రెడ్డప్పను హత్యచేసిందెవరు? అందులో ఎందరు పాల్గొన్నట్లు?

*(1977, నవంబర్ 'ప్రజాతంత్ర' లో ప్రచురితం)*

# -- కథ గురించి. . .

టెన్త్‌క్లాస్ తప్పిన వాళ్ళు రైళ్ళ కిందపడిచావడమో, ఇతర రకాల ఆత్మహత్యలు చేసుకోవడమో చూస్తూవున్నదే. ఆవయస్సులో వాళ్లు తమ భవిష్యత్ ప్రణాళికనంతా రూపొందించుకుని వుండి, అది దెబ్బతినడం వల్ల నిస్పృహతో, నిరాశతో ఆత్మహత్య చేసుకుని వుంటారని ఊహించలేం. అందరూ పెద్దవాళ్ళ భయంతోనే ఆత్మహత్య చేసుకుని వుంటారనీ అనుకోలేం.

నా క్లాస్‌మేట్ ఒకడు ప్రొద్దుటూరునుంచీ ఎర్రగుంట్ల వెళ్ళి అక్కడ రైలు కింద పడిదుర్మరణం పాలయ్యాడు. నాకు తెలిసినంతవరకూ అతన్ని తల్లిదండ్రులు పరీక్ష తప్పినందుకేమీ అనే వాళ్ళు కారు. ఆసంఘటన నాకు తెలిసినది. మిగతాది నా ఊహ. మన విద్యావిధానం గురించి నాజ్ఞానం మేరకు చెప్పాను.